# కేటీఆర్‌పై కేసు నమోదు.. రేవంత్ కుట్రే

కంటోన్మెంట్, డిసెంబర్ 21: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా ఫార్ములా ఈ కారు రేసింగ్‌ను చేపట్టగా, అవకతవకలకు పాల్పడ్డారంటూ కేసులు నమోదు చేయడంపై వారు మండిపడుతున్నారు. ఈ రేస్ అంశంపై అసెంబ్లీలో చర్చించాలని బీఆర్‌ఎస్ పట్టుబట్టినా కాంగ్రెస్ సర్కారు పారిపోవడంపై ధ్వజమెత్తారు.

## కేటీఆర్ అంటే.. కాంగ్రెస్‌కు వెన్నులో వణుకు



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుడుతున్నది. తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటడమే లక్ష్యంగా ఫార్ములా ఈ కారు రేసింగ్‌ను చేపట్టారు. అవకతవకలకు పాల్పడ్డారంటూ కేసులు నమోదు చేయడం రాజకీయ కక్ష్య సాధింపే. అసెంబ్లీలో చర్చకు రావాలని కేటీఆర్ పిలుపునిస్తే వెనుకడుగు వేస్తున్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుండగా భయపడి కేసులతో వేధించాలని చూస్తున్నారు.

- జక్కుల మహేశ్వర్‌రెడ్డి,
మాజీ ఉపాధ్యక్షులు, కంటోన్మెంట్ బోర్డు

## డైవర్షన్ పాలిటిక్స్ కోసమే కేటీఆర్‌పై కేసు..



ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నందున డైవర్షన్ చేయడానికే కేటీఆర్‌పై అక్రమ కేసు నమోదు చేయించారు. అక్రమంగా కేసులు బనాయిస్తే రేవంత్ ప్రభుత్వానికి కోర్టులో మొట్టికాయలు తప్పవు. ఫార్ములా –ఈ రేస్ నిర్వహించిన కేటీఆర్.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచితే.. అవినీతి జరిగిందని రేవంత్‌రెడ్డి అడ్డంగా వాదిస్తున్నారు. ప్రభుత్వానికి బీఆర్‌ఎస్ మీద కక్ష తప్ప ప్రజాపాలన మీద దృష్టి లేదు. విజ్ఞులైన ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారు. కేటీఆర్ మీద పెట్టిన కేసు ఉపసంహరించుకోవాలి. లేదంటే ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆగ్రహానికి గురికాక తప్పదు.

- గజ్జెల నాగేశ్, మాజీ చైర్మన్,
రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్

## పాలనపై దృష్టిపెట్టాలి..

ప్రభుత్వం పరిపాలన, అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. కేటీఆర్‌పై సీఎం రేవంతర్‌రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఫార్ములా రేస్‌తో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరాల సరసన నిలిపారు. ఈ రేస్‌ను కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకున్నారు. రూ. 55 కోట్లు నేరుగా హెచ్‌ఎండీఏ ద్వారా ఫార్ములా సంస్థకు చెల్లింపులు జరిగాయని కేటీఆర్ చెప్పారు. రేవంత్‌రెడ్డిని ఆ సంస్థకు చెందిన వ్యక్తి కలిసిన విషయాన్ని ఎందుకు దాచారు? ఇప్పుడు ఈ రేస్‌ను నిర్వహించకపోవడం వల్ల సదరు సంస్థ ప్రభుత్వంపై ఫిర్యాదు చేసింది. అసలు రేవంత్ రెడ్డిపై కేసు నమోదు చేయాలి. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే చూస్తూ ఊరుకోం. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్నది. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే మరో ఉద్యమం ఎగిసిపడుతుంది.



- మన్నె క్రిశాంక్,
మాజీ చైర్మన్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ

## ఇక తెలంగాణలో బెనిఫిట్ షోలు ఉండవు

బేగంపేట్ డిసెంబర్ 21: తెలంగాణలో ఇప్పటి నుంచి ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవని, టికెట్ల ధరలు పెంచబోమని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో గాయపడి కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీ తేజను శనివారం సాయంత్రం మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీతేజకు గొంతులో పైపులు వేసి ఆహారం అందిస్తున్నారని ప్రస్తుతం బలహీనంగా ఉండటంతో పాటు ఎలాంటి చలనం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ తేజ ఆరోగ్యంపై ఇంకా వైద్యులు ఏం చెప్పడం లేదన్నారు. శ్రీ తేజ కోలుకునేంత వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ. 25 లక్షల ఇస్తామని హామీ ఇచ్చారు. శ్రీ తేజ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

## తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి



కందుకూరు, డిసెంబర్ 21 : మండలంలోని వివిధ గ్రామాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి లెటర్ రాసినట్లు శనివారం ఆమె తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజల సౌలభ్యం కోసం 500 జనాభా ఉన్న తండాలను, గూడాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో మండలంలో 35 గ్రామ పంచాయతీలు ఏర్పాటైనట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గఫూర్‌నగర్, గుమ్మడవెల్లి పంచాయతీ పరిధిలోని గుమ్మడవెల్లి తండా, నేదునూరు గ్రామ పం చాయతీ పరిధిలోని మాన్యగూడ, ఆకులమైలారం పంచాయతీ పరిధిలోని మాలగూ డ, పోతుబండ తండా గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలు గా గుర్తించాలని కో రారు. దీంతో గ్రామాల్లో పాలన సౌలభ్యంగా ఉంటుందని వివరించారు.ఆయా గ్రామాల ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేయాలని కోరారు.

## పనులు సకాలంలో పూర్తి చేయాలి



అడ్డగుట్ట : కమ్యూనిటీ హాల్ పనులను పునఃప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని సీపీఎం నాయకులు హైదరాబాద్ నగర నాయకుడు వెంకటేశ్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో అడ్డగుట్టలో నిర్మాణం జరుగుతున్న కమ్యూనిటీ హాల్ వద్ద ప్ల కార్డులతో నిరసన తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించి ఐదేండ్లు కావస్తుందని, పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అజయ్ బాబు, మల్లేశ్, బాలయ్య, ఎల్లయ్య, అనిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.



## ప్రపంచాన్ని ఏకం చేసేది క్రిస్మస్

మారేడ్‌పల్లి, డిసెంబర్ 21: క్రిస్మస్ పర్వదినం ప్రపంచాన్ని ఏకం చేస్తుందని సీఎస్‌ఐ మెదక్ డయాసిస్ బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ అన్నారు. శనివారం జర్నలిస్టు ఫర్ క్రైస్ట్ ( జేఎఫ్‌సీ) ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని సీఎస్‌ఐ మెదక్ డయాసిస్ కార్యాలయంలో సెమి క్రిస్మస్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మార్క్ మాట్లాడుతూ...డిసెంబర్ 25 వచ్చిందంటే క్రిస్మస్ జరుపుకుంటారన్నారు. మొట్టమొదటి సారి క్రైస్తవ జర్నలిస్టులు ఒకచోట జరుపుకోవడం శుభపరిణామన్నారు. ఉస్మానియా జర్నలిజం విభాగం మాజీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ స్టీవెన్సన్, సీనియర్ జర్నలిస్టులు స్టెర్లీ రాజన్, రవికుమార్, విజయమేరీ, జోసఫ్ ఆంటోనిను సన్మానించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, రెవరెండ్ రాజశ్వర్‌రావు, సాల్మన్, రెవరెండ్ డేనియల్ పాల్గొన్నారు.

## ‘ది టాలెంట్ సెర్చ్ ఈవెంట్’



నెక్స్ట డికేడ్ ఎడ్యుకేషన్ సంస్థ ‘ది టాలెంట్ సెర్చ్ ఈవెంట్’ పేరుతో వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు విశేష స్పందన లభించింది. జెక్ కాలనీలోని గాంధీ పార్క్ ఆవరణలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ టెలాంట్ సెర్చ్ ఈవెంట్‌లో 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. జెక్ కాలనీ నివాసితుల ఫెడరేషన్ సహకారంతో నిర్వహించిన ఈ ఈవెంట్‌లో చెస్, డిబేట్, డ్రాయింగ్, క్విజ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. నిర్వాహక సంస్థ నెక్స్ట డికేడ్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు కమలేశ్ మహంతి, సహ వ్యవస్థాపకులు సాహ్నవి వంతారంతో పాటు వలంటీర్లు సాయిపవన్, రేవంత్, కార్తిక్ విశేష కృషి చేశారు. పోటీల్లో ప్రతిభ చాటిన చిన్నారులకు కాలనీ నివాసితుల ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మల్లు ప్రసాద్, చందులు బహుమతులు అందజేశారు.

-అమీర్‌పేట్

## ‘అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి’




నిరసన కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్

చిక్కడపల్లి, డిసెంబర్ 21: అంబేద్కర్‌ను కించపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం లెబర్టీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ.. అంబేద్క్‌ను అగౌరవపరుస్తూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రదర్శనలో యమున గౌడ్, మహిళా వింగ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ లక్ష్మ్యానాయుడు, విజయ్ ముల్లంగి, జావీద్ షరీఫ్, ఖలీమ్ బాబా, అహసన్ అబ్బాస్, సుధారాణి, జయసింగ్ జాదవ్, ధర్మేంద్ర తివారి, అజీమ్ బైగ్,లక్ష్మణ్, వైశాళి, డాక్టర్ షకీల్ అక్బర్ పాల్గొన్నారు.

## పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మారేడ్‌పల్లి, డిసెంబర్ 21 : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో మోండా డివిజన్‌కు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మోండా డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు ప్రమోద్, నందు పాల్గొన్నారు.

## స్ట్రీట్‌లైట్స్ సమస్యను పరిష్కరించాలి

చిక్కడపల్లి, డిసెంబర్ 21 : గాంధీనగర్ డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల్లో వీధి దీపాలు వెలుగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఆమె మాట్లాడుతూ.. జోనల్ కమిషనర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. సీనియర్ సిటిజన్స్, మహిళలు సాయంత్రం భయాందోళన చెందుతున్నారని, చీకటిలో పలుచోట్ల యాక్సిడెంట్లు జరుగుతున్నాయని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ కోరారు.

## మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



ధర్నా సందర్భంగా మాట్లాడుతున్న యూనియన్ నాయకులు


చిక్కడపల్లి, డిసెంబర్ 21 : కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, ఎన్‌ఎంఆర్ ఫిక్స్‌డ్ పే పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ,ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద మున్సిపల్ కార్మికులు మహాధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా నర్సింహులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో 65వేల మంది కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎన్‌ఎంఆర్, ఫిక్స్‌డ్ పే పద్ధతుల్లో ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. పర్మినెంట్, కనీస వేతనాలు అమలు కావడం లేదని మండిపడ్డారు. అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.నాగమణి , శ్రావణ్ కుమార్, గుర్రం అశోక్, వెంకటస్వామి పాల్గొన్నారు.



## సమాధులను కూల్చొద్దు

బొల్లారం : హైవే కారిడార్ వలన ముస్లింల సమాధులను తొలగించవద్దని తెలంగాణ ఉద్యమ కారుడు, బీఆర్‌ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ యాసీన్ అన్నారు. శనివారం కంటోన్మెంట్ న్యూ బోయిన్‌పల్లిలోని ముస్లింల శ్మశాన వాటిక వద్ద నిరసన తెలిపారు. యాసీన్ విలేకరులతో మాట్లాడుతూ.. శ్మశాన వాటికకు రోడ్డు వైపునా ఉన్న కేంద్ర రక్షణ శాఖ భూములను వినియోగించుకొని, హైవే కారిడార్ నిర్మించాలని కోరారు. కారిడార్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునారాలోచించి ఆలయాలు, మసీదులు కూల్చకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## అనాథాశ్రమాలకు నిత్యావసరాలు



బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 21 : పద్మారావునగర్‌కు చెందిన యూరో కిడ్స్ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఇండ్ల నుంచి సేకరించిన ఆహార సామగ్రిని, నిత్యావసరాలను పలు అనాథాశ్రమాలకు విరాళంగా అందజేశారు. ‘దాన్ ఉత్సవ్–2024’లో భాగంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఏస్తర్ విద్యావతి ఆధ్వర్యంలో న్యూబోయిగూడ, గాస్‌మండి, సీతాఫల్‌మండిలోని అనాథాశ్రమాలకు వెళ్లి చిన్నారులను పలకరించారు.

## రాయితీ ధరలలో తెలుగు వర్సిటీ పుస్తకాలు



హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో డిసెంబర్ 19నుంచి 29వరకు కొనసాగున్న 37వ జాతీయ పుస్తక ప్రదర్శనలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన పుస్తకాలను సాహితీ ప్రియులకు రాయితీ ధరలలో అందించాలనే లక్ష్యంతో 146 స్టాల్‌లో అందుబాటులో ఉంచినట్లు వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు తెలిపారు.

– తెలుగు యూనివర్సిటీ

## చైనా మంజా విక్రయ దారుల అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్,ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ కె.శ్రీనివాస్‌తేజ

మెహిదీపట్నం డిసెంబర్ 21: ప్రమాదకర చైనా మాంజాను విక్రయస్తున్న ముగ్గురిని ఆసిఫ్‌నగర్ పోలీసులు దక్షిణ, పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 4.26లక్షల విలువ చేసే మాంజాను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ విజయ్‌శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి వివరాలను వెల్లడించారు. మంగళ్‌హాట్‌కు చెందిన శంకర్ సింగ్, వినయ్‌రాజ్ సింగ్,అనూప్‌సింగ్‌లు చైనా మాంజాను విక్రస్తున్నట్లు సమాచారం అందడంతో దక్షిణ, పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి శంకర్‌సింగ్‌పై దాడి చేయగా అతడు ఇచ్చిన సమాచారంతో మరో ఇద్దరిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 13 వరకు ప్రవచనాలు

హిమాయత్‌నగర్ : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో డా. కోగంటి వేణుగోపాల కృష్ణమా చార్యులచే తిరుప్పావై ప్రవచనములు జనవరి 13 వరకు జరుగుతాయని శనివారం ప్రకటనలో టీటీడీ తెలిపింది.

## ‘గణిత మేధావి శ్రీనివాస రామానుజం’



రామానుజన్ చిత్ర పటానికి నివాళులర్పించిన సీహెచ్ త్రినాధరావు



గణిత ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను అభినందించిన హెచ్‌ఎం కోటేశ్వరరావు

ముషీరాబాద్, డిసెంబర్ 21: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా శనివారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి గాయకుడు సీహెచ్ త్రినాథరావు ముఖ్య అతిథిగా విచ్చేసి శ్రీనివాస్ రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. గణిత మేధాసంపన్నుడు రామానుజం అధ్యయనం చేసి ప్రపంచానికి మనదేశం గొప్పదనాన్ని చాటిన మహనీయుడని కొయాడారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయకుడు శ్రీధర సుబ్రహ్మణ్యం, శంకర ప్రసాద్, ఆమంత పాల్గొన్నారు.

### బోయిగూడ ఉన్నత పాఠశాలలో ‘గణిత ప్రదర్శన’

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 21 : ‘జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం’ సందర్భంగా న్యూ బోయిగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మ్యాథమెటిక్స్ ఎగ్జిబిషన్‌ను ప్రధానోపాధ్యాయులు టి.కోటేశ్వరావు ప్రారంభించారు. విద్యార్థులు గణిత ప్రాముఖ్యతను తెలిపేలా తమ సజనాత్మకతతో రూపొందించిన ప్రాజెక్టులు, చార్ట్‌లు, గేమ్స్, మోడల్స్‌ను పరిశీలించి, అభినందించారు. న్యూబోయిగూడకు చెందిన పద్మావతి పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటిరియల్, ఇష్వా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా జామెట్రీ బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కలిసి రావాలి




ఖైరతాబాద్, డిసెంబర్ 21 : డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ నినాదంతో నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్ వద్ద శనివారం 2కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ముఖ్య అతిథిగా హాజరైన పద్మభూషణ్ అవార్డు గ్రహీత కోడూరు ఈశ్వర వరప్రసాద రెడ్డి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భం గా వారు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. పోలీసు, ఎక్సైజ్ శాఖ సమన్వయంతో పనిచేస్తున్నాయని, డ్రగ్స్ గు రించి అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తెలంగాణ విదాయ సమితి ప్రతినిధి పెండెం తారక్, రవి, గణేశ్, అశోక్ సంతోశ్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై టీటీడీ బోర్డు ప్రకటనను వెనక్కుతీసుకోవాలి

తెలుగు యూనివర్సిటీ : తిరుమల కొండపైన తెలంగాణ భక్తులకు జరుగుతున్న అసౌకర్యాలు, ఇబ్బందులపై మీడియా సమక్షంలో మాట్లాడినందుకు మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్‌పైన టీటీడీ బోర్డు చర్యలు తీసుకుంటామన్న ప్రకటనను వెనక్కు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాజీయ పార్టీల నా యకులు రాజకీయం కోసం తిరుపతిలో గతంలో అనేక పర్యాయాలు ప్రసంగించిన విషయాన్ని టీటీడీ బోర్డు పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. బలహీన వర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడినందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించడం సమంజసం కాదన్నారు.

## తెలుగు ఫాంట్ ఆవిష్కరణ

రవీంద్రభారతి, డిసెంబర్ 21: శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో శీలా వీర్రాజు చేతివ్రాతతో రూపొందిన ‘తెలుగు ఫాంట్’ ఆవిష్కరణ, ‘మాట్లాడుకోవడానికి మనిషి కావాలి’ పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా నందిని సిధారెడ్డి, ఫాంట్ ఆవిష్కర్త సుధామ, ఫాంట్ డిజైనర్ పురుషోత్తంకుమార్, డా.అమృతలత, పుప్పాల శ్రీరామ్, శీలా సుభద్రాదేవి తదితరులు విచ్చేసి పుస్తకాలను ఆవిష్కరించారు.

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE MEDCHAL MALKAJGIRI DISTRICT AT : KUSHAIGUDA**
**O.S.NO. 882 OF 2022**
**BETWEEN:**
SMT. USHA DEVI BALDWA & Others ...PLAINTIFF
A N D
SRI P.BAL REDDY & Others ...DEFENDANTS
TO
8. SRI.S.R.GANESH, S/o. S.Raju, Aged about 50 Years, Occ: Service, R/o. H.No. 6-38/37, Bank Colony, Old Bowenpally, Secunderabad-500 011.
**NOTICE**
The Plaintiff herein had filed the Suit for Declaration and Consequential Injunction against the Defendants. The Hon'ble Court had ordered for publication of this Notice for appearance of Defendant No.8 and the matter is posted to 02.01.2025. Therefore, you may appear before the Hon'ble Principal District Judge, Medchal-Malkajgiri District at Kushaiguda on 02.01.2025 at 10:30 A.M. either personally or through authorized Counsel or otherwise the matter will be adjudicated in due process of Law.
Hence, this Notice.
**[BY ORDER OF THE COURT]**
**For M/s RESU LAW OFFICE,**
Advocates.